బ్రహ్మచారులకు గృహస్థులంటే అసూయ.
వివాహితులకు బ్రహ్మచారులంటే అసూయ.
అందుకే ఒకరికొకరు అబద్ధాలు చెప్పుకుంటారు. అవి నిజమైతే అదీ జీవితం.

# ఉత్త(రం) కథ

పెళ్ళికాని వాళ్ళకీ, పెళ్ళయి కాపురం పెట్టనివాళ్ళకీ - రీసెర్చి స్కాలరు రాజారావిచ్చే సందేశమేమిటంటే - రాబోయే భార్య గురించి ఏవేవో వెర్రి వెర్రి కలలు కంటూ, ఊహాలోకంలో విహరించక - వాస్తవానికి దగ్గరలో ఉండమని. ఈ సందేశం అతను స్వానుభవం మీద ఇచ్చినదే!

ఈ సందేశాన్నివ్వడానికి వారం రోజులు ముందు అతను లాబొరేటరీలో కూర్చుని అదే పనిగా ఆలోచించసాగాడు. ఆలోచిస్తున్న కొద్దీ అతనికి తనేదో పెద్ద పొరబాటు చేశానని అనిపించసాగింది.

అక్కడున్న యాసిడ్ బాటిల్సన్నిటి లోనూ వసుంధర ముఖం కనిపించినప్పటికీ అతనాట్టే ఆశ్చర్యపడలేదు. బంగారంవంటి వసుంధరను కరిగించే శక్తి అక్కడున్న ఏ "యాసిడ్"కూ లేదు - పైగా తెల్లగా కనిపిస్తున్న ఆ బాటిల్స్‌లో ఆమె ముఖం కనిపంచడంలో ఆశ్చర్యం లేదు. కానీ ఆకుపచ్చని "క్రోమియమ్ క్లోరైడ్" సొల్యూషన్లోంచీ ఆమె ముఖం కన్పిస్తోందంటే అది తనలోని లోపమేననుకోవాలి.

రెండు గంటల వరకూ ప్రయోగాలతో కుస్తీ పట్టి విఫలుడయ్యాకనే అతను కూర్చుని ఆలోచించసాగాడు - నైట్రికాసిడ్ పడి పసుపుపచ్చగా మారిన తన అరిచేతి వంక చూసుకుంటూ-

అసలు తను తొందరపడి పెళ్లి చేసుకోవడం వల్లనే ఈ నష్టాలన్నీ వచ్చాయని గ్రహించడానికతనికెంతో సేపు పట్టలేదు.

వసుంధరతో అతనికి వివాహం నిశ్చయమై చాలాకాలమే అయింది. అయినా అప్పుడతని ఆలోచనల్లో ఆమె ఎక్కువగా మెదిలేది కాదు. అసలతనికి వివాహం మీదనే దృష్టి లేదు. థీసిస్ సబ్మిట్ చేసేదాకా పెళ్ళి చేసుకోకూడదని అతను గట్టిగానే అనుకున్నాడు.

అయితే - పెద్దకొడుకుని పెళ్ళి పీటల మీద చూడాలని కోరుకునే ముసలి తల్లీ, ఇంకా రెండేళ్ళుపోతే. చదువాట్టే లేని తన కూతుర్ని పెళ్ళి చేసుకోడేమోననే భయంతో కాబోయే మావగారూ అతన్ని ఉత్తరాలతో ఉక్కిరిబిక్కిరి చేసి అతనిచేత అవుననిపించారు.

పెళ్ళయితే మాత్రం ఏమయింది - థీసెస్ సబ్మిట్ చేసేదాకా శోభనానికి ఒప్పుకోకుండా ఉంటే - చక్కగా రీసెర్చి చేసుకోవచ్చునని అనుకున్నాడతను.

కానీ - తన ఊహ పూర్తిగా పొరబాటని అతనికిప్పుడర్థమయింది. ఏ ముహూర్తాన వసుంధర మెడలో అతను మూడు ముళ్ళు వేశాడో గానీ - ఆ మూడు ముళ్ళలోని మాహాత్మ్యం కావచ్చు!

రాజారావు పెళ్ళయ్యాక విశాఖపట్నం వచ్చి నెలరోజులు దాటినప్పటికీ - అతను లాబొరేటరీకి సరిగా రావడంలేదనీ, వర్కు సరిగా చేయడం లేదనీ - ప్రొఫెసరుగారతన్ని సాధించసాగారు. కానీ అతను ఏం చేస్తాడు? మనస్సంతా వసుంధరమీదకే పోతోంది...

హృదయాన్ని పోగొట్టుకోవడమంటే ఏమిటో అతనికి అర్థమయింది.

రాజారావు రచయిత, అందువల్ల ఎక్కువగా ఊహల్లో తేలే అలవాటుంది. ఊహలో తేలినప్పుడల్లా అతనికి వసుంధర కనిపించి కవ్వించసాగింది. - ఇదీ అతని అవస్థ. దీనికి నివారణోపాయం ఏమిటి?

అతను బుర్ర బద్దలు కొట్టుకుని ఆలోచించాడు. బుర్ర బద్దలయిందో లేదో గాని - ఆలోచన మాత్రం తట్టలేదు. అతన్ని కలుసుకోవడానికి అప్పుడే లాబొరేటరీకి వచ్చిన స్నేహితుడొకడు - అతని ముఖాన్ని చూస్తూనే పడుతున్న అవస్థను గుర్తించి -"త్వరగా కాపురం పెట్టేయకూడదుటోయ్!" అన్నాడు.

"అది నేనెలా చెప్పను. మా మావగారికి తట్టాలిగానీ-" అనుకున్నాడతను, స్నేహితుడికి మాత్రం బదులుగా చిరునవ్వు నవ్వుతూ.

వసుంధరను స్మృతిపథంలోంచి తప్పించడానికని అతను ఆ రోజు మ్యాట్నీకి "పెళ్ళిచేసి చూడు!" సినిమాకి వెళ్ళాడు. సినిమా చాలా సరదాగానే ఉండి అతన్ని మరిపించబోయిందిగానీ మధ్యలో ఎన్టీరామారావుకీ జీవరలక్ష్మికీ వివాహం జరగడంతో అతనికి తన పెళ్ళి గుర్తుకొచ్చి మళ్ళీ వసుంధర గుర్తుకొచ్చేసింది.

అప్పుడే అతనికో ఆలోచన తట్టింది. తను వసుంధరకో ఉత్తరం రాస్తే -

కానీ, ఆమెతో తనకింకా ఏ విధమైన చనువూ ఏర్పడలేదు - మరి ఎలా రాస్తాడు? రాసినా అంతా ఏమనుకుంటారు?

అతని మనస్సు సందిగ్ధంలో పడింది. ఉత్తరం రాయాలని అతనికి గాఢంగా అనిపించసాగింది. కానీ జవాబు మావగారి దగ్గర్నుంచి వస్తుందేమోనని అతని భయం - "తప్పబ్బాయ్ - అలా రాయకూడదు" అంటూ మావగారు రాస్తే -

తన అనుమానాలకి అతనికి నవ్వొచ్చింది. ముక్కు, మొహం ఎరగని ఆడపిల్లకి ధైర్యంగా ఉత్తరాలు రాసే యువకులున్న ఈ రోజుల్లో, తను స్వయంగా తాళికట్టిన భార్యకు ఉత్తరం రాయడానికి ఎంతగానో ఆలోచిస్తున్నాడంటే హాస్యాస్పదంగా ఉండదూ?

కానీ - వసుంధర అట్టే చదువుకోలేదు. తను ఉత్తరం రాస్తే అర్థం చేసుకుని, జవాబిచ్చే తెలివితేటలు ఆమెకున్నాయా, లేక - నలుగురూ నవ్వితే, అభిమానపడి ఏడుస్తుందా?

సినిమా నుంచి బయటకు వచ్చి కాఫీ హోటలుకు వెళ్ళిన అతను అక్కడ కనిపించిన స్నేహితుని ముందు ఇదే సందేహాన్ని వెలిబుచ్చాడు. ఆ స్నేహితుడు ఫక్కున నవ్వేశాడు.

"చాలా పూర్వకాలంవాడిలా ఉన్నావోయ్ నువ్వు - భార్యకు ఉత్తరం రాయడానికి ఇంత ఆలోచనా? అసలు - శోభనం ముందురాసుకున్న ఉత్తరాలు ఎంత ఆహ్లాదకరంగా ఉంటాయో తెలుసా? అనుభవం మీద చెబుతున్నాను, రాసి చూడు ఒకసారి తెలుస్తుంది మజా!"

రాజారావు అనుమానంగా అన్నాడు "మరి జవాబు వస్తుందంటావా?"

ఆ స్నేహితుడు మళ్ళీ నవ్వి అన్నాడు, "నా అనుభవం చెప్పనా మరి - మా ఆవిడ నాకు జవాబిస్తూ "మీరు ఉత్తరం రాయకపోతే మరో రెండ్రోజులు చూసి నేనే రాద్దామనుకుంటున్నాను" అని రాసింది. ఆడవాళ్ళకీ, మనకీ ఈ ఊహల్లో మాత్రం ఏ తేడా లేదంటే నమ్ము!"

రాజారావుకీమాటలు ఉత్సాహాన్ని కలిగించాయి. ఏమైనాసరే భార్యకు ఉత్తరం రాయాలని నిర్ణయించుకున్నాడు. ఎప్పుడైతే ఉత్తరం రాయాలీ అని నిర్ణయించుకున్నాడో వెంటనే అతనికో ధర్మసందేహం వచ్చింది. ఏమని రాయాలీ అని.

అసలు భర్త భార్యకు ఉత్తరంలో ఏం రాస్తాడు? ఈ విషయం ఒకళ్ళనడిగేది కాదు. అయినా అతనుఅడిగీ అడగనట్లుగా ఆ స్నేహితుణ్ణి ఆడిగాడు "ఏమిటో పేజీలు పేజీలు ఉత్తరాలు రాసేస్తావ్ - ఏంరాస్తావేమిటోయ్ మీ ఆవిడకి"

ఆ స్నేహితుడు నవ్వి - "కథలు రాసేవాడిని. నీకు నేనేం చెప్పగలను" అన్నాడు.

అప్పుడతనికి తను కథకుడినని గుర్తుకొచ్చింది. అవునుమరి. తను కథకుడే - ఊహించి తను ఇప్పటికి చాలా రాశాడు. అటువంటిది భార్య కొక ఉత్తరాన్ని ఊహించ లేడూ!

కానీ, తను రాసిన ఉత్తరానికి జవాబు రావాలి. లేకపోతే తన మనస్సు గాయపడుతుంది. అందుకని తనెంతో జాగ్రత్తగా ఉత్తరాన్ని రాయాలి. కథలు రాయడానికి మూడ్‌కోసమని అతను అప్పుడప్పుడు బీచికి వెడుతూండేవాడు. కాబట్టి ఇప్పుడు కూడా బీచికి వెడితే మంచిదని అతనికనిపించింది. వెంటనే బీచికి బయల్దేరాడు.

బీచి దగ్గర అతనికి భాస్కరావనే స్నేహితుడు కనిపించారు.

"హలో! ఏమిటి విశేషాలు?" రాజారావు పలకరించాడు.

"ముందు నాకు కంగ్రాచ్యులేషన్స్ చెప్పాలి!"

"ఎందుకు?"

"నా మొదటి ఉత్తరానికి మా ఆవిడ దగ్గర్నుంచి సమాధానం వచ్చింది-"

ఎందుకనో రాజారావు ముఖం మాడిపోయింది. "కంగ్రాచ్యులేషన్స్" అన్నాడు

నెమ్మదిగా. ఎందుకో తనకు అసూయ కలిగిందని అతనుగ్రహించాడు. భాస్కరావు భార్య భాస్కరరావుకి ఉత్తరం రాస్తే తనకు అసూయ ఎందుకు? తనుత్తరం రాస్తే తన భార్య మాత్రం జవాబు రాయదు కనుకనా?

వెంటనే అతనికి చక్కని ఊహ తట్టింది. ఎలా రాస్తే భార్య వద్ద నుంచి ఉత్తరం వస్తుందో అర్థమయిందనిపించింది. అన్యమనస్కంగానే భాస్కరావుతో సంభాషణ ముగించి బీచి నుంచి తొందరగా రూమ్ చేరుకున్నాడు.

అప్పటికి క్యారియర్ వచ్చి రెడీగా ఉంది. రూమ్‌మేట్ లక్ష్మినారాయణ అతనికోసమే ఎదురు చూస్తూండడంవల్ల రాగానే రాజారావుని పలకరించబోయాడు. "ఉత్తరం రాస్కోవాలి? నన్ను మాట్లాడించకండి!" అని సీరియస్‌గా ఓ తెల్లకాగితాన్ని తీసి కుర్చీలో కూర్చుని, జేబులోంచి పెన్ను తీసి విదిపాడు. పెన్నులో సిరా ఉంది.

ఏదయినా మంచి పని చేద్దామనుకున్నప్పుడు దాని కన్నీ విఘ్నాలే జరుగుతాయని కథకుడిగా నమ్మే రాజారావు పెన్నులో సిరా ఉండి ఉండదని అనుకున్నాడు. కానీ, పెన్నులో సిరా ఉండడంతో, తను చేస్తున్నది మంచి పనికాదేమోనని ఒక లిప్తకాలం అతనికి అనిపించింది. అయినా, అతను నిరుత్సాహపడకుండా రాయడం మొదలు పెట్టాడు.

రాసేముందు అతను అనుకున్నాడు. సంబోధన చాలా సింపుల్‌గా, సహజంగా ఉండాలని. ఏదో సినిమాలలోలా, కృత్రిమంగా హృదయరాణి, ఆరాధ్యదేవత అంటూ వ్రాయకూడదు.

ఉత్తరం రాయడం మొదలుపెట్టాడతను.

"ప్రియమైన చి॥సౌ॥ వసుంధరకు రాజారావు దీవించి వ్రాయునది –

నీవు థర్డు ఫారం ప్యాసయినట్లు మీ నాన్నగారు రాసిన ఉత్తరం వల్ల తెలుసుకుని చాలా సంతోషించాను. ముందు ముందు కూడా బాగా చదివి అలానే ప్యాసవుతావని ఆశిస్తున్నాను.

నీవు చదువుకోలేదనీ, అందువల్ల నేను ఉత్తరం రాస్తే జవాబివ్వవనీ నా స్నేహితులు నన్నేడిపించడం మొదలుపెట్టారు. వాళ్ళు నిన్నలా తక్కువ చేస్తుంటే చూడలేక, చదువుకోక పోయినా నా భార్య తెలివితేటలకేం తక్కువకాదు; నేను ఉత్తరం రాయకగానీ, రాస్తే వెంటనే సమాధానం ఇస్తుందని పందెంకట్టాను ఆ పందెంలో వాళ్ళని గెలిపిస్తావో, నన్నే గెలిపిస్తావో నీదే భారం!

నేను తొందరగా రీసెర్చి పూర్తిచేసుకుని ఉద్యోగంలో ప్రవేశిద్దామనుకుంటున్నాను. ఆ తొందర ఎందుకనుకుంటున్నావు – నీ కోసమే!

మొన్న పెళ్ళి చేసి చూడు సినిమా చూశాను. సినిమా చాలా బాగాఉంది– అందులో ఒక పెళ్ళి జరుగుతూంటే మన పెళ్ళి గుర్తుకొచ్చింది. వెంటనే నీవూ, అమాయకమైన నీ ముఖం గుర్తుకొచ్చాయి. మనసంతా అదోలా అయిపోయి వెంటనే నీకు ఉత్తరం రాయాలని పించింది. ఒక విధంగా ఉత్తరం రాయడానికి ఇదీ కారణమే!

నాలుగేళ్ల క్రితం పెళ్లి చూపులకని నేను వచ్చినప్పుడు - పెళ్ళని నిన్ను నలుగురూ వేళాకోళం చేస్తున్నారని ఏడుస్తూ కూర్చున్నావు. అప్పుడు నిన్ను నేనలాగే చూడవలసి వచ్చింది. ఇప్పుడు నేను ఉత్తరం రాశానని నలుగురూ వేళాకోళం చేస్తే ఏడుస్తూకూర్చుంటావేమోనని భయంగా ఉంది. నీవలాంటిదాని వయితే మాత్రం నాకు జీవితమంతా ఏడుపే అవుతుంది. కానీ నీవలాటి దానివని అనుకోను. నీవు నా బంగారు వసుంధరవు - అవునా?

మన పెళ్ళి ఫొటోలు మా ఊళ్ళో తీయించుకున్నవి - నాన్నగారు పంపించారు. చాలా బాగా వచ్చాయి. అన్నింటిలోనూ నువ్వే బాగున్నావు. ఒక ఫొటోలో నవ్వుతూ ఎంతో బాగా పడ్డావు. ఆ ఫొటోలను రోజుకు పది సార్లేనా చూసుకుంటున్నానంటే నమ్ము!

ఇలా రాస్తుంటే బహుశా నీకూ ఆ ఫొటోలను చూడాలనిపిస్తుందనుకుంటాను. కావాలంటే తప్పక పంపిస్తాను. కానీ ఒక్క షరతు నీ ఫొటో ఏదయినా ఉంటేపంపించు - లేదా కనీసం ఈ ఫొటోలనయినా వెంటనే పంపించేయి! ఏ సంగతీ జవాబిస్తావు కదూ!

ఇంకా ఎన్నో రాయాలని ఉంది. కానీ నీ వద్ద నుంచి జవాబు రాదేమోననే అనుమానం నన్ను పీడిస్తోంది. పైగా జవాబు రాకపోతే స్నేహితుల్లో అవమానం! అన్నీ వివరంగా రాశాను, అటుపైన నీ ఇష్టం!

మీ నాన్నగారి దగ్గర్నుంచి తరచూ ఉత్తరాలు అందుతూనే ఉన్నాయి. వాటి వల్లే మీ అమ్మగారి క్షేమమూ, తమ్ముళ్ళ క్షేమమూ తెలుస్తున్నాయి.

మీ తమ్ముళ్ళు పరీక్షలు ప్యాసైనారని తెలిసి చాలా సంతోషించాను. వాళ్ళను బాగా చదువుకోమను. పెళ్ళిలో చూసినప్పుడు నీవు చాల బలహీనంగా ఉన్నట్టు కనిపంచావు. ఏవయినా మంచి మందులు పుచ్చుకో! ఇక్కడ క్యారియరు భోజనం చేస్తున్న నా ఆరోగ్యం సంగతి వేరే ఏమీ వ్రాయనక్కరలేదు.

ఇంతే సంగతులు. నీ జవాబు కోసం ఎదురుచూస్తుంటాను. ఏ జవాబూ రాకపోతే మాత్రం ఇదేనీకు నా ఆఖరి ఉత్తరం -

రాజారావు"

ఉత్తరం రాసేసి ఓసారి భారంగా నిట్టూర్చాడు రాజారావు. అంతసేపూ ఓపిగ్గా ఎదురుచూస్తున్న లక్ష్మీనారాయణ "రాయడం అయిపోయిందిగా మరి భోంచేద్దామా?" అన్నాడు. సరేనంటూ లేచాడు రాజారావు.

రాజారావుకి అన్నం సహించలేదు. తనురాసిన ఉత్తరమే మెదుల్తోంది మనసులో. అనుకోకుండా తను రాశాడు ఉత్తరాన్ని. తప్పకుండా జవాబు రావాలి!

తొందరగా భోజనం ముగించి అతను మంచం మీద పడుకుని మళ్ళీ ఉత్తరాన్ని చదువుకోసాగాడు. ఒకసారి, రెండుసార్లు, మూడుసార్లు.... తర్వాత అతనికి విసుగొచ్చింది. ఉత్తరాన్ని మడతపెట్టి కవర్లోకి నెట్టేశాడు. ఎడ్రస్ రాస్తూ వసుంధర పేరురాసేటప్పుడు

అతని చేయి వణికింది.

మరో పావుగంటలోనే రోజూ లానే చుట్టుపక్కల వాళ్లంతా రాజారావు రూమ్ చేరుకున్నారు. హస్కు ప్రారంభించడానికి. మధ్యలో రాజారావు తను ఉత్తరం రాసినట్లుగా ప్రకటించాడు. స్నేహితులతన్ని అభినందించారు. అనుమానిస్తున్న అతనికి - తప్పక జవాబు వస్తుందని అభయమిచ్చేరు కూడా. ఆ సందర్భంలోనే ఉత్తరమే గనుక వస్తే పార్టీ ఇస్తానని స్నేహితులకు వాగ్దానమిచ్చాడు.

రాజారావు నవ్వుకున్నాడు. ఉత్తరం వస్తుందని మిత్రులు చెబుతూంటే రాదని వాదిస్తున్నది తను! కానీ తను వసుంధరకు వ్యతిరేకంగా రాశాడు. అంటే జవాబు కోసం తను అబద్ధం రాశాడు.

ఆలోచనల్లో ఉన్న రాజారావు ఆ రాత్రి సంభాషణలో అట్టే పాల్గొనలేకపోయాడు. కనీసం అతనికి నిద్ర వచ్చినా బాగుండేది. అదీ రాలేదు. కలత నిద్రలో, మధ్య మధ్య వసుంధరను గురించి కలలు కంటూ ఆ రాత్రి గడిపేశాడతను.

మర్నాడుదయం పెందరాళే లేచి కాలకృత్యాలు తీర్చుకుని, టంచనుగా టైముకి పోస్టు బాక్సులో పడేశాడు ఉత్తరాన్ని.

ఆ రోజల్లా క్షణమొక యుగంలా గడిచింది రాజారావుకి. తను పొరబాటు చేశాడేమో. ఉత్తరం రాయకూడదేమో, రాసి వసుంధరకీ మావగారికీ లోకువైపోతాడేమో, అసలు జవాబే రాదేమో.... ఇవే ఆలోచనలు అతన్ని ఆ రోజుల్లా వేధించాయి.

ఓ కథ చదువుతూ, కాలచక్రం వేగంగా పరుగెడుతోందని ఎలా అనగలిగారు చెప్మా అనుకున్నాడు రాజారావు. అసలు కాలచక్రం పరుగెట్టడం మాట దేవుడెరుగును -ఆగిపోకుండా కదిలితే చాలుననుకున్నాడతను ఆ రోజు ఎప్పటికీ గడవకపోవడం వల్ల విసుగొచ్చి.

ఏమైనా కాలచక్రం ఆగిపోలేదు. ఆ రోజు గడిచింది. మరో రోజు గడిచేటప్పటికి అతను కొంచెం వాస్తవికంలోకి వచ్చాడు. వస్తే ఈ పాటికి ఉత్తరం వచ్చేయాలి. అక్కణ్ణించి ఉత్తరం రావడానికి ఒక రోజు మించదు. ఎలాగూ తనకు ఉత్తరం రాదు. దానికోసం ఎదురు చూడ్డం కూడా ఎందుకు?

అతని అనుమానాన్ని బలపరుస్తూ మరో రెండు రోజులు కూడా ఉత్తరం రాలేదు.

కానీ, అతను ఉత్తరం రాసిన నాటికి అయిదో రోజున ఉదయం - రాజారావు ఇంకా మంచం మీది లేవకుండానే, ఎక్స్‌ప్రెస్ డెలివరీ కవరు వచ్చింది. ఎక్కడినుంచో అనుకుంటూ కవరు చించి ఉత్తరం లాగేసరికి వసుంధర సంతకం కనిపించింది. రాజారావు నిద్రమత్తు వదిలిపోయింది.

అప్పుడతనికి కలిగిన ఆనందం అనుభవైకవేద్యమే కానీ, మాటల్లో చెప్పడం కష్టం. చాలా సేపటి వరకూ అతను ఆ ఉత్తరాన్ని చదవలేకపోయాడు.

కొంతసేపు గడిచేక అతను ఆనందపు అఘాతాన్నించి తేరుకుని ఉత్తరాన్ని చదువుకోసాగాడు.

"ప్రియమైనమీకు నమస్కరించి వ్రాయునది ఇక్కడ అంతా క్షేమం. మీ క్షేమంతో వ్రాసిన ఉత్తరం అందింది. నేను ఎప్పుడూ ఎవ్వరికి అసలు ఉత్తరం వ్రాయుట అలవాటు లేదు. నాకు ఎప్పుడైనా ఉత్తరం వ్రాయడం సంభవించిన యెడల ఎక్స్‌ప్రెస్ డెలివరీ వ్రాయవలెను. ఎందుచేతనంటే మాకు ఉత్తరములు సరిగా ఇచ్చుట లేదు. అయినా స్కూలు తెరిచి చదువులో పడితే తీరుబడి ఉండదు. నేను స్కూలు ఫైనల్ దాకా చదవాలని ఆశగా ఉన్నది. మీ స్నేహితులతో పంతాలు పడి రాసినారు కనుక వెంటనే జవాబు ఇస్తున్నాను. నాకోసమని కంగారుపడి ఉద్యోగము కోసము ప్రయత్నించవద్దు. ఒకమాటు మన పెళ్ళి ఫొటోలు పంపితే అందరికీ చూపిస్తాను. ఆషాఢపట్టి తీసుకుని మా నాన్న గారు వచ్చెదరు. మీరు కథలు వ్రాసినట్లు వ్రాయవద్దు. నవ్వు వస్తోంది. శ్రావణమాసంలో నోమునోచుకుంటాను. మా అన్నయ్య వడుగుకు కాపవరము వెళ్ళినాము. నాలుగు రోజులుండి వచ్చినాము. మా స్కూలు 20వ తారీఖునుంచి తెరిచినారు. సినిమాలు ఇంకా ఏమీ చూడలేదు. చూసిన తరువాత వ్రాస్తాను. పుస్తకాలు కొనుక్కున్నాను. ఇంటి పేరు కూడా మార్పించినారు. నేను ఇదివరకన్న బాగానే ఉన్నాను. అయినా, డాక్టర్ని అడిగి మందులు పుచ్చుకుంటాను. ఇప్పుడుమీ వంట్లో ఎలా ఉన్నది? పిల్లలందరూ క్షేమముగానే ఉన్నారు. ఫొటోల మాట మర్చిపోవద్దు. మీ ఆరోగ్యము జాగ్రత్త. మీ ఉత్తరము చూసి మా నాన్నగారు, మా అమ్మ చాలా సంతోషించినారు. నా రాత బాగా ఉండదు. నవ్వవద్దు. ఇంతే సంగతులు. తప్పులున్న క్షమించవలెను. ఈ ఉత్తరము అందిన వెంటనే చింపిపారవేయవలెను.

ఇట్లు

వసుంధర"

మొదటిసారి చదివినప్పుడతనికి ఉత్తరం సరిగ్గా అర్థం కాలేదు. రెండో సారి చదివినప్పుడు కొద్దిగా అర్థమయింది. మూడోసారి చదివేసరికి పూర్తిగా అర్థమయింది.

భార్య వద్ద నుంచి వచ్చే ఉత్తరం ఎంతో మధురంగా ఉంటుందనీ - తను రాసినట్లుగానే ఆమె కూడా పెద్ద ఉత్తరం రాస్తుందనీ ఆశించాడతను కానీ ఈ ఉత్తరం అతన్ని వాస్తవిక జగత్తులోకి తీసుకువచ్చింది.

ఉత్తరంలో అతన్ని బాధించిన అంశాలు చాలా ఉన్నాయి. ఎప్పుడైనా ఉత్తరము వ్రాయడం సంభవించిన యెడల - అంటే అస్తమాను వ్రాయవద్దనా? ఎప్పుడూ రాస్తుండమని అడగడానికి బదులు అలా రాసిందా, తరువాత - కథలు రాసినట్లుగా రాయవద్దంది - తనెంతో కష్టపడి రెండు పేజీల్లో ఇమిడ్చిన భావాలను కథ అని వేళాకోళం చేసింది.

ప్రతి వాక్యమూ అతన్నిలాగే నిరుత్సాహపరిచింది.

మధ్యాహ్నం - ఉత్తరం వచ్చిందని తెలుసుకున్న స్నేహితులతన్ని పార్టీ అడిగారు. అతను బాధగా తనను ఉత్తరం ఎంత నిరుత్సాహపరిచిందీ చూచాయగా చెప్పాడు. అప్పుడు ఆ స్నేహితుల్లో ఒకతను నవ్వాడు - "ఓస్, దీనికేనా -మా ఆవిడా ఇంచుమించు

నా కలాగే రాసింది. అయినా, నేనెప్పుడైనా నిరుత్సాహపడ్డానా? భార్యరాసిన ఉత్తరాలు మధురంగా ఉంటాయని అనడం ఎందుకో తెలుసా? అవివాహితులకు మనమీద అసూయ కలిగించడానికి - తెలుసా?"

రాజారావు స్నేహితులకి పార్టీ ఇచ్చేశాడు. ఆలోచిస్తున్నకొద్దీ అతనికి వసుంధర ఉత్తరంలో ఏదో మాధుర్యం లేకపోలేదనిపించింది. వెంటనే రూమ్‌కి వచ్చి ఉత్తరాన్ని మళ్ళీ చదువుకున్నాడు. బాగుందనిపించింది. మళ్ళీ మళ్ళీ చదివినకొద్దీ ఇంకా ఇంకా బాగుందనిపించసాగింది. హఠాత్తుగా తన కలా ఎందుకనిపించడం మొదలుపెట్టిందో అతనికర్థం కాలేదు. బహుశా అవివాహితుల అసూయకు గురి కావడానికా?

ఏది ఏమైనా రాబోయే భార్య గురించి ఏవేవో ఊహించుకునే వాళ్ళకి తన ఉత్తరం కథ చెబితే - వాళ్లకు కొంత ఉపకారం చేసినవాడినవుతాననుకున్నాడు రాజారావు. భార్యరాసిన ఉత్తరం బాగుందని తను చెప్పడం కంటే - ఎలా ఉంటుందో ఆ అమాయకులకు చెబితే - వాళ్ళే ఊహించుకుంటారుగదా!

ఈ ఉద్దేశ్యంతో అతను తన అనుభవాన్ని కాగితాల మీద కెక్కించే ఉద్దేశంతో - జేబులోంచి పెన్ను తీసి విదిపాడు. పెన్నులో సిరా లేదు!

✦ ✦ ✦